"ఎందుకిలా చేసారు?" అడిగింది భార్య.

"అన్నిట్లోనూ ఉప్పో, చింతపండో, కారమో ఎక్కువయ్యాయి." జవాబు చెప్పాడు అతను.

"కావాలనే నేను ఇవాళ ఇలాంటి వంట చేసాను. మీకు భార్యగా ఉన్నది ఒక్క నేనే కాదు. మీ చెవి, నాలిక, ముక్కు, చర్మం, కళ్ళు కూడా మీ భార్యలే. వాటి మీద మీకు గల అనురాగాన్ని కూడా మీరు నియంత్రించగలిగితే ఆధ్యాత్మికంగా మీ ప్రయాణం వేగవంతం అవుతుందని తెలియచెప్పాలని ఇలా వండాను."

ఆమె ఆ ఆకు తీసేసి ఎప్పటిలా వండిన భోజనాన్ని వడ్డించిన ఆకుని తెచ్చి ఆయన ముందు పెట్టింది.

అతను వెంటనే లేచి భార్య తీసేసిన ఆకుని కుప్పతొట్టి లోంచి తెచ్చుకుని తన ముందు ఉంచుకుని నిశ్శబ్దంగా తిన్నాడు.

## 192. ఉన్నది ఒక్కటే

తీర్థ యాత్రలు చేస్తూ ఓ చిన్న ఊరికి వచ్చిన ఓ సన్యాసి ఓ పిట్టగోడ మీద కూర్చుని తత్వాలు పాడుకుంటూంటే, ఇద్దరు పోకిరి వాళ్ళు అతని మీదకి రాళ్ళని విసిరారు. ఒకటి అతని నుదుటికి తగిలి గాయం అయింది.

మర్నాడు ఆ సన్యాసి ఆ ఊరునించి వెళుతూ దారిలో ఎదురుపడ్డ ఆ పోకిరి వాళ్ళకి గ్రామస్థులు తనకిచ్చిన ఉప్పు శెనగలని తలాకాస్త పెట్టాడు.

"ఇదేమిటి? నిన్న నిన్ను మేం రాళ్ళతో కొట్టినా మళ్ళీ మాకు ఎందుకు ఇవి ఇస్తున్నావు?" అడిగారు వాళ్ళు ఆశ్చర్యంగా.

"ఎందుకంటే నాలో ఏం ఉందో మీ ఇద్దరిలో కూడా ఉన్నది అదే అని నాకు తెలుసు కాబట్టి. మనందరిలో ఉన్నది అదే అని తెలిస్తే అప్పుడు మీరు ఎవరి మీదా రాళ్ళని రువ్వలేరు." చెప్పాడు ఆ సన్యాసి.